క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

భూదాన్‌పోచంపల్లి : మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం జెడ్పీ సీఈఓ శోభారాణి సందర్శించారు. రికార్డులు, రాజీవ్ యువవికాసం దరఖాస్తులను పరిశీలించారు. పైలట్ గ్రామం వంకమామిడిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ సేవలు, మందుల స్టాక్ వివరాలను వైద్యాధికారిణి శ్రీవాణిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీడీఓ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, సూపరింటెండెంట్ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ మాజిద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉపాధ్యాయుల బడిబాట

రామన్నపేట: మండలంలోని వెల్లంకి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ముందస్తు బడిబాట కార్యక్రమంను నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లితండ్రులను కలిశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వసతులు, విద్యాబోధన, ప్రభుత్వ అందించే ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పల్లె మోహన్‌రెడ్డి, ఏఏపీసీచైర్మెన్ సులోచన, మాజీచైర్మెన్ కర్రె రాజు, ఉపాధ్యాయులు ఇట్టె సోమిరెడ్డి, ఉయ్యాల భిక్షమయ్య, దూదిగామ సువర్ణ, ఎం.వెంకటయ్య, కె.మాధవి పాల్గొన్నారు.

పాఠశాల ఫ్లెక్సీ దగ్ధం

భువనగిరి: ఫీజు చెల్లించడం లేదని మాంటిస్సోరీ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ శనివారం పాఠశాల ఎదుట టీఎస్ఎస్ఎఫ్ పట్టణ మాజీ అధ్యక్షుడు తోట నర్సింగ్ రావు ఆధ్వర్యంలో ఫ్లెక్సీ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజుల పేరుతో మధ్యతరగతి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పడిగెల అనిల్, శివకుమార్, సుభాష్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

రామన్నపేట: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం- 3లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలు పైబడిన పిల్లలకు అసెస్మెంట్ కార్డు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత, అంగన్‌వాడీ టీచర్ ప్రవీణ, భార్గవి, నిఖిత పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా

ఆత్మకూరు(ఎం): ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి పాండు కోరారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్, నాయకులు తుమ్మల సత్యనారాయణరెడ్డి, మల్లెల శ్రీశైలం, సత్తయ్య పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి


ముత్తిరెడ్డిగూడెంలో రాస్తారోకో నిర్వహిస్తున్న వివిధ పార్టీల నాయకులు

మోటకొండూర్: ఆలేరు- నల్లగొండ వయా మోటకొండూర్ బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం రోడ్డుపై శనివారం వివిధ పార్టీల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మోటకొండూర్ మండల కేంద్రానికి వెళ్లేందుకు గ్రామాల నుంచి ఎలాంటి బస్సు సౌకర్యం లేదని, ప్రభుత్వం రవాణ సదుపాయాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆడెపు శ్రీనివాస్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంధమల్ల లింగస్వామి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈరగాని శ్రీనివాస్ గౌడ్, గంధమల్ల పాండు, బొడిగ భాస్కర్‌గౌడ్, బోడ అంజయ్య, స్వామి, రవి, సత్తయ్య తదితరులున్నారు.

పాఠశాల ప్రహరీకి మోక్షం

- రూ.10 లక్షల నిధులు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు


దాతర్‌పల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా, పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు సమకూర్చడంతో ఇక్కట్లు తీరనున్నాయి. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఊరికి చివరగా, చుట్టూ చెట్ల మధ్యలో ఉంటుంది. దీంతో పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పాములు, విష కీటకాలు వస్తూ ఉంటాయి. పిల్లలు ఆడుకునే సమయంలో వారికి విష కీటకాల ద్వారా ప్రమాదం పొంచి ఉంది. ప్రహరీ లేకపోవడంతో భయం భయంతో విద్యార్థులు చదువులు కొనసాగించారు. ప్రహరీ నిర్మాణానికి సీడీపీ నిధులు రూ.10 లక్షలు వారం రోజుల క్రితం మంజూరయ్యాయి. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి కూడా రూ.5 లక్షలు మంజూరయ్యాయి..

పాములు వస్తాయేమోనని భయంగా ఉండేది



పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఎప్పుడు ఏ విష పురుగులు, పాములు యేమోనని భయంగా ఉండేది. ఆడుకునే సమయంలో, పాఠశాలకు వచ్చే పోయే క్రమంలో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉంది.

– శశివర్ధన్, 9వ తరగతి, దాతర్‌పల్లి

ఇక్కట్లు తొలగనున్నాయి

పాఠశాల ప్రహరీ నిర్మాణం చేయాలని గతంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు విన్నవించాం. మా సమస్యను పట్టించుకుని నిధులు మంజూరు చేయించారు. గత కొన్నేళ్లుగా పాఠశాలు ప్రహరీ లేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఇక్కట్లు తొలగిపోనున్నాయి.

– భాస్కర్, మాజీ ఉపసర్పంచ్, దాతర్‌పల్లి

రైతుల భూమికి భద్రత కల్పించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


భూ భారతి చట్టంపై రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్: రైతుల భూములకు చట్టపరమైన భద్రతను కల్పించడానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి భూ సమస్యలు లేకుండా చూస్తారని, ప్రజల అభిప్రాయాల మేరకు చట్టాన్ని చేయడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ధరణి పోర్టల్ తీసుకువచ్చి విలువైన భూములను కాజేసిందని ఆరోపించారు. అనంతరం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.6లక్షల 94వేలను 24మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ నారాయణరెడ్డి, తహసీల్దార్ భగత్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పింగళ్‌రెడ్డి, శ్యాంగౌడ్, బాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణతో పేద ముస్లింలకు న్యాయం


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్‌గౌడ్

భూదాన్‌పోచంపల్లి : వక్ఫ్ చట్ట సవరణతో పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో జన్ జాగరన్ అభియాన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 10లక్షల కోట్ల విలువైన 8లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులున్నాయని, దేశంలో 31శాతం పేద ముస్లింలున్నప్పటికీ వక్ఫ్ ఆస్తులను వారి అభ్యున్నతికి వినియోగించకుండా అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. పేద ముస్లింల అభ్యున్నతికి ఉపయోగపడే వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాహెశ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, గంజి బస్వలింగం, నోముల గణేశ్, చెరుకు రాము, చిటుకుల అంబదాస్, అంజియాదవ్, తండ రమేశ్, సత్యనారాయణ, జి. ప్రభాకర్, సుశీల, చేరాల లింగయ్య, సీత లక్ష్మణ్, భిక్షపతిచారి, గోదాసు లింగస్వామి, ఒంటెద్దు సత్యం, శ్రవన్, బడుగు శ్రీకాంత్, రచ్చ శేఖర్, బాలరాజు, జ్ఞానేశ్వర్, నరేందర్, తుమ్మ లక్ష్మీనారాయణ, సిద్దు, వనం వెంకటేశం, ఎం. రవి, పాండు పాల్గొన్నారు.

భూ భారతితో రైతుల భూములకు రక్ష

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


ఆలేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఐలయ్య

ఆలేరురూరల్: రైతుల భూముల రక్షణకే భూ భారతి చట్టం రూపొందించినట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం ఆలేరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులకు మేలు జరగకపోగా అనేక సమస్యలకు గురి చేశారని ఆరోపించారు. వేల ఎకరాల భూమి కొల్లగొట్టారని, భూ భారతి చట్టం ద్వారా వారు చేసిన దోపిడీని బట్టబయలు చేస్తామన్నారు. త్వరలో గ్రామ రెవెన్యూ వ్యవస్థను తీసుకువస్తామని, దీంతో చాల సమస్యలకు గ్రామ స్థాయిలో పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. జూన్ నుంచి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. భూ భారతి చట్టంపై ఏమైనా అనుమానాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవ్‌రెడ్డి, డీఏఓ గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

గుండాల : ధరణిలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం గుండాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు సమస్యలను పరిష్కరించి రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ధరణిని అడ్డుపెట్టుకొని భూ కబ్జాలు చేసిన వారిని శిక్షిస్తామన్నారు. రైతులకు వీలు కలిగే విధంగా సాదా బైనామాను తీసుకువచ్చి ప్రతి రైతుకు భూదార్ కార్డు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మోత్కూరు మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు కృష్ణారెడ్డి, వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ నీలిమ, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలను పార్టీ ఎజెండాలో చేర్చాలి


రావుల చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పోచంపల్లి చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత సమస్యలను బీఆర్ఎస్ పార్టీ ఎజెండాలో చేర్చాలని పోచంపల్లికి చెందిన పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంక లక్ష్మీనారాయణ, మిర్యాల కృష్ణమూర్తి కోరారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్‌ను కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించేందుకు కృషిచేయాలని కోరారు. జియోట్యాగింగ్ కలిగిన చేనేత కార్మికులకు చేనేత సహకార సంఘాల్లో సభ్యత్వాలను కల్పించాలన్నారు. హెల్త్‌కార్డులు అందజేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని, చేనేతకు బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల మాదిరిగానే చేనేత కార్మికులకు కూడా రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని తెలిపారు. ఐఐహెచ్‌టీ సంస్థను పోచంపల్లిలో నెలకొల్పేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి



బొమ్మలరామారం : మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్

చౌటుప్పల్ : వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ కోరారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు వెళ్లే ముందు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేయాలన్నారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, డిల్లీ మాధవరెడ్డి, ఊడుగు మల్లేష్, చిన్నం బాలరాజు, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, తాడూరు పరమేష్, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, తొర్పునూరి మల్లేష్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, కొండ యాదగిరి, మాచర్ల కృష్ణ, చలమందరాజు, తదితరులున్నారు.

భూదాన్‌పోచంపల్లి: వరంగల్‌లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాటి సుధాకర్‌రెడ్డి, చిల్వేరు బాలనర్సింహ, బందారపు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశం కోరారు. ఈమేరకు వారు శనివారం స్థానికంగా మాట్లాడారు.

బొమ్మలరామారం : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పోలగొని వెంకటేష్ గౌడ్ కోరారు. శనివారం బొమ్మలరామారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ గూదె బాల్ నర్సింహ, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మన్నె శ్రీధర్, మాజీ సర్పంచ్‌లు కూర వెంకటేష్, పూడూరి నవీన్‌గౌడ్, జూపల్లి భరత్, అన్నారం గణేష్, ఉపేందర్, నరేష్ నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

పంచనారసింహులకు నిత్యారాధనలు


నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం స్వామి, అమ్మవారి నిత్యకల్యాణం అర్చకులు నేత్రపర్వంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభూలకు నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ప్రాకార మండపం, ముఖమండపంలో శ్రీసుదర్శన హోమం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వేళ జోడు సేవలను మాడవీధిలో ఊరేగించారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ వెంకటయ్య

చౌటుప్పల్ : చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య కోరారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పాలకవర్గంతో కలిసి వినతిపత్రం అందజేశారు. 40వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్‌ట్యాంకు, సీసీ ప్లాట్‌ఫామ్, కార్యాలయం, రైతుల విశ్రాంతి భవనం, పాలకవర్గం కోసం ప్రత్యేక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు సప్పిడి సంజీవరెడ్డి, డిల్లీ చంద్రకళ, పబ్బు శ్రీకాంత్ తదితరులున్నారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువు, బఫర్ జోన్‌లో సెల్ టవర్ నిర్మాణ పనులు చేస్తుండడంతో మోత్కూరుకు చెందిన పలువురు నాయకులు శనివారం కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే సెల్ టవర్ నిర్మాణం ఆపి వేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి బుర్రు అనిల్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్, సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ఉన్నారు.

ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళి


ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఈఓ భాస్కర్‌రావు, అర్చకులు, అధికారులు, పోలీసులు

యాదగిరిగుట్ట: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉద్యోగులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ శనివారం యాదగిరికొండపై ప్రదర్శన నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదుల దుశ్చర్య అమానుషమని ఈఓ పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, ఆలయ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు గజివెల్లి రమేష్‌బాబు, ఎస్‌పీఎఫ్ ఆర్ఎస్ఐ కే.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ చౌటుప్పల్ మండల ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణ కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద పాకిస్తాన్ జెండాను దహనం చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు తొర్పునూరి సాయిలు, ప్రతినిధులు యజ్ఞమాచారి, మెట్టు రామచంద్రారెడ్డి, ఊడుగు రమేష్, తొర్పునూరి మల్లేష్, కాటంరాజు, వనం రుషి, రాఘవేంద్ర, బొడిగె ప్రభాకర్, ప్రవీణ్, మహేందర్, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

రామన్నపేట: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడిని నిరసిస్తూ మునిపంపుల సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, తొల్పునూరి శ్రీనివాస్, జంపాల అండాలు, నోముల రమేష్, ధనలక్ష్మీ, హేమలత, ధనమ్మ, సంధ్య, బూడిద భిక్షం, పి. నాగార్జున, స్వామి, సురేందర్, యాదగిరి, ఉపేందర్, సందీప్, మధు, బాలకృష్ణ పాల్గొన్నారు.

మోత్కూరు : కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద కాల్పుల్లో మృతిచెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఆర్యవైశ్య భవనం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మొగుళ్లపల్లి సోమయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సోమవెంకటేశ్వర్లు, గౌరు శ్రీనివాస్, వీరవెల్లి ప్రవీణ్‌కుమార్, సోమనర్సయ్య, అశోక్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

రాజాపేట: కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని వ్యతిరేకిస్తూ శనివారం రాత్రి రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామంలో గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.


చౌటుప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

మేడే ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

భూదాన్‌పోచంపల్లి : మేడే ఉత్సవాల సందర్భంగా పోచంపల్లి పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు కోరారు. శనివారం పట్టణ కేంద్రంలో మున్సిపల్ కార్మికులతో కలిసి మేడే ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలపై ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాక జగన్, ముత్తమ్మ, శేఖర్, జంగయ్య, రాజు, బాలస్వామి, బాబు, రాజు, సబిత, కృష్ణవేణి, పారిజాత, లలిత, చంద్రకళ, శారద, లలిత తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలు జయప్రదం చేయాలి

వలిగొండ : ప్రపంచ కార్మిక దినోత్సవం, మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు కోరారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుర్కపెల్లి సురేందర్, రాదారపు మల్లేశం, జన్ని జంగయ్య, ఎడవెల్లి ఎల్లమయ్య, రాములు, నర్సింహ, వలయ్య, రాములు, మల్లేశం, వెంకటేశం, రేణుక, కృష్ణవేణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

➡ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలి

మోత్కూరు : రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా గుర్తించాలని బీజేపీ మోత్కూరు మండల అధ్యక్షుడు గూదె మధుసూదన్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

➡ అక్రమంగా ఉంటున్న పాకిస్తాన్ దేశస్తులను గుర్తించాలి

చౌటుప్పల్ : మన దేశంలో అక్రమంగా ఉంటున్న పాకిస్తాన్ దేశస్తులను గుర్తించి, పంపించాలని కోరుతూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో సీఐ మన్మథకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారిలో మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, మండల, పట్టణ కమిటీల అధ్యక్షులు కైరంకొండ అశోక్, కదారి కల్పన, నాయకులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉబ్బు భిక్షపతి, పక్కీరు శ్రీనివాస్‌రెడ్డి, కట్ట కృష్ణ, తడక సురేఖ, పబ్బు కుమార్, ఉష్కాగుల నాగరాజు, పబ్బు వంశీ, దిండు భాస్కర్ తదితరులు ఉన్నారు.

➡ ఆదిలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

గుండాల : మండలంలోని పెద్దపడిశాల గ్రామంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సహిత నర్సింహస్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమోహనాచార్యులు, గొడిశాల నాగరాజు, మణిమాల, తోట రవి, పద్మ, డేగల శ్రీను, స్వర్ణలత, కందుకూరి చందు, లక్ష్మయ్య, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

➡ నైట్ హాల్ట్ బస్సు ఏర్పాటు చేయాలి

మోత్కూరు : మోత్కూరు నుంచి ఉప్పల్ వెళ్లేందుకు నైట్ హాల్ట్ బస్సు ఏర్పాటు చేయాలని మోత్కూరు డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు బయ్యని రాజు, మామిడాల యాకేష్‌కుమార్ కోరారు. ఈమేరకు శనివారం యాదగిరిగుట్టలో డిపో మేనేజర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. మోత్కూరు నుంచి ఉదయం 4 గంటలకు ఉప్పల్ హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి రాత్రి 9 గంటలకు మోత్కూరుకు బయలుదేరే విధంగా చూడాలని పేర్కొన్నారు.

➡ ఎల్‌ఓసీ చెక్కు అందజేత

వలిగొండ : వలిగొండ మండలంలోని వేములకొండకు చెందిన గూడెల్లి నరేష్ కుమార్తెకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.8 లక్షల ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు.

➡ కంఠమహేశ్వర స్వామికి బోనాలు

వలిగొండ : మండలంలోని నెమలికాల్వలో శనివారం గౌడ కులస్తులు కంఠమహేశ్వర స్వామికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో వంగాల వాసుదేవ్ గౌడ్, వంగాల వెంకన్న గౌడ్, వంగాల రోహిత్ గౌడ్, వంగాల భిక్షం గౌడ్, నిలుగొండ వెంకటేశం, వెంకట రాజు, వంగాల వెంకటయ్య గౌడ్, రామకృష్ణ, వెంకటేష్, వంగాల కుమార, గోపగోని అంజయ్య, మోర్త్రి యాదయ్య, నిలుగొండ వెంకటేష్ రాము, రవికిరణ్ సుంకరి రాజు పాల్గొన్నారు.

➡ గ్రామదేవతలకు బోనాలు

మోటకొండూర్: మండలంలోని చాడ గ్రామంలో శనివారం బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ, కాటమయ్యలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

➡ బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

రామన్నపేట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీరప్ప దేవాలయంలో వచ్చేనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు, 9 నుంచి 15 వరకు జరిగే శ్రీ బీరప్ప కామరాతిదేవి కల్యాణ మహోత్సవాల ఆహ్వానపత్రికను శనివారం స్థానిక కురుమసంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోటె లక్ష్మణ్, శెల్వోజీ, ఈతాపుల రాజు, మోటె మల్లేష్, గొరిగె నర్సింహ, మోటె అంజయ్య, సిందం లింగయ్య, బండ లింగస్వామి, మోటె యాదగిరి, మోటె మహేష్, కడమంచి అయిలయ్య, ఎమ్మె జంగయ్య, బెడిద లింగస్వామి, మోటె రాజు, గొరిగె కిరణ్, శ్రీశైలం పాల్గొన్నారు.

రైతులకు గోవుల అందజేత

అడ్డగూడూరు : హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన శ్రీకృష్ణ గో సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు 13 గోవులను శనివారం ఉచితంగా అందజేశారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు గ్రామానికి చెందిన గూడ సోమయ్య, శ్రీశైలం, కుటికంటి నాగయ్య, లక్ష్మారెడ్డి, అవిలయ్య, మల్లయ్య, వేముల నాగయ్యలకు గోవులు అందించారు.


గోవులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

న్యాయనిర్ణేతలకు అభినందనలు



శ్రీకాంత్, రవికుమార్, సువాస్‌లను అభినందిస్తున్న అడిషనల్ ఎస్పీ రాహుల్‌రెడ్డి

భువనగిరిటౌన్ : జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు న్యాయనిర్ణేతలుగా భువనగిరికి చెందిన కొండ్రెడ్డి శ్రీకాంత్, ఓరుగంటి రవికుమార్, సువాస్ ఎంపికయ్యారు. ఈమేరకు వారిని భువనగిరి అడిషనల్ ఎస్పీ రాహుల్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో అభినందించారు.